



సీల్ పై సంతక చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సృజన

ఓ(పో)టెత్తారు..!

- గతం కంటే పెరిగిన పోలింగ్
- కర్నూలు జిల్లాలో 76.42, నంద్యాలలో 81.12 శాతం నమోదు



ఆదోని మండలం పెద్దతుంబలంలో బారులుతీరిన ఓటర్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు పోటెత్తారు. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా గత ఎన్నికల కంటే పోలింగ్ పెరిగింది. గత ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 78.38 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ సారి కర్నూలు జిల్లాలో 76.42 శాతం, నంద్యాలలో 81.12 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు...

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున బారులుతీరారు. జిల్లా వ్యాప్తంగా తెల్లవారుజామున వర్షం కురవడంతో వాతావరణం ఓటర్లకు అనుకూలించింది. దీంతో పోలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందే ఓటర్లు భారీ ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల లోపు జనం గుంపులు గుంపులుగా ఉండకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ ప్రారంభమయ్యే సమయానికే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిక్కిరిసి కనిపించాయి. ఆ తరువాత నుంచి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య పెరుగుతూ కనిపించింది. పోలింగ్ ప్రారంభంలోనే పలు ప్రాంతాల్లో ఇవిఎంలు మొరాయించడంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి చూడాల్సి వచ్చింది. మధ్యాహ్నం నుంచి ఎండ వేడిమి కనిపించినా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల సంఖ్య తగ్గలేదు. ఎండ వేడిమిని సైతం లెక్కచేయకుండా ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల్లో మధ్య మధ్యలో అభ్యర్థులు పోలింగ్ సరళిని పరిశీలించారు. అక్కడక్కడ కొద్ది పాటి ఉద్రిక్త వాతావరణం కనిపించింది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి చక్కబడింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసేటప్పటికి ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరారు. ఆ సమయానికి క్యూలైన్‌లో ఉన్న వారందరికీ ఓటు వేసేందుకు పోలింగ్ అధికారులు అవకాశం కల్పించారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా గత ఎన్నికలతో పోలిస్తే ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ శాతం పెరిగింది. మరో ఏడు అసెంబ్లీ స్థానాల్లో కొంత మేర తగ్గుదల కనిపించింది. గతేడాది ఉమ్మడి కర్నూలు జిల్లాలో 78.38 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ సారి కర్నూలు జిల్లాలో 76.42 శాతం, నంద్యాలలో 81.12 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 20,54,563 మంది ఓటర్లు ఉండగా 15,70,007 మంది ఓటు వేశారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 13,72,091 మంది మొత్తం ఓటర్లు ఉండగా 11,13,040 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 83.96 శాతం, శ్రీశైలం నియోజకవర్గంలో 82.43 శాతం, నందికొట్కూరు నియోజకవర్గంలో 87.25 శాతం, కర్నూలు నియోజకవర్గంలో 58.96 శాతం, పాణ్యం నియోజకవర్గంలో 74.81, నంద్యాల నియోజకవర్గంలో 76.83, బనగానపల్లె నియోజకవర్గంలో 83.42 శాతం పోలింగ్ నమోదైంది. డోన్ నియోజకవర్గంలో 79.30 శాతం, పత్తికొండ నియోజకవర్గంలో 81.57, కోడుమూరు నియోజకవర్గంలో 77.68, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 79.65, మంత్రాలయం నియోజకవర్గంలో 85.18, ఆదోని నియోజకవర్గంలో 65.47, ఆలూరు నియోజకవర్గంలో 80.11 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 83.12 శాతం, శ్రీశైలం నియోజకవర్గంలో 81.70 శాతం, నందికొట్కూరు నియోజకవర్గంలో 81.69 శాతం, కర్నూలు నియోజకవర్గంలో 63.75 శాతం, పాణ్యం నియోజకవర్గంలో 74.44, నంద్యాల నియోజకవర్గంలో 75.00, బనగానపల్లె నియోజకవర్గంలో 82.29 శాతం పోలింగ్ నమోదైంది. డోన్ నియోజకవర్గంలో 82.91 శాతం, పత్తికొండ నియోజకవర్గంలో 84.98, కోడుమూరు నియోజకవర్గంలో 79.14, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 81.97, మంత్రాలయం నియోజకవర్గంలో 84.31, ఆదోని నియోజకవర్గంలో 66.55, ఆలూరు నియోజకవర్గంలో 80.73 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే పాణ్యం, మంత్రాలయం, ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు, నంద్యాల, బనగానపల్లె నియోజకవర్గాల్లో కొంత మేర పోలింగ్ శాతం తగ్గింది. మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది.

పార్లమెంట్ వారీగా పోలింగ్ ఇలా..

పార్లమెంట్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
కర్నూలు	17,22,857	13,23,071	76.80
నంద్యాల	17,03,797	13,59,975	79.82



పత్తికొండ మండలంలో...

అంకెల్లో పోలింగ్ వివరాలు..

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	గతేడాది పోలింగ్
కర్నూలు	2,74,465	1,74,973	63.75	58.96
పాణ్యం	3,31,706	2,46,935	74.44	74.81
పత్తికొండ	2,23,603	1,90,009	84.98	81.57
కోడుమూరు	2,46,632	1,95,181	79.14	77.68
ఎమ్మిగనూరు	2,47,752	2,03,086	81.97	79.65
మంత్రాలయం	2,08,350	1,75,667	84.31	85.18
ఆదోని	2,63,058	1,75,064	66.55	65.47
ఆలూరు	2,58,997	2,09,092	80.73	80.11
ఆళ్లగడ్డ	2,30,914	1,91,935	83.12	83.96
శ్రీశైలం	1,93,962	1,58,467	81.70	82.43
నందికొట్కూరు	2,16,559	1,76,907	81.69	87.25
నంద్యాల	2,67,645	2,00,733	75.00	76.83
బనగానపల్లె	2,38,900	1,96,590	82.29	83.42
డోన్	2,24,111	1,85,810	82.91	79.30

స్ట్రాంగ్ రూములకు తాళాలు

- కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు
- పర్యవేక్షించిన జిల్లా ఎన్నికల అధికారి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సార్వత్రిక పోలింగ్ అనంతరం ఇవిఎం యంత్రాలను కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. కర్నూలు నగర శివారులోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల ఇవిఎం యంత్రాలను భద్రపరిచారు. ఒక్కో నియోజకవర్గానికి ప్రత్యేకంగా స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం సోమవారం అర్ధరాత్రి నుండి మంగళవారం ఉదయం వరకు వాటిని సీల్ చేసి స్ట్రాంగ్ రూములో భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్ రూములన్నింటికీ తాళాలు వేసి ప్రత్యేకంగా పోలీసు భద్రత నడుమ ఉంచారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగు రూముల్లో ఇవిఎం యంత్రాల భద్రపరిచే ప్రక్రియను నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన ఆయా నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు ఇవిఎం యంత్రాల భద్రపరిచే ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రత్యేకంగా పోలీసు నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగు రూములకు తాళాలు వేసి ఇవిఎంలను భద్రపరిచామన్నారు. నిరంతరం సిసి కెమెరాలను కూడా పెట్టి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రిసైడింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



సీల్‌పై సంతకం చేస్తున్న ఎన్నికల అధికారి

బాబు గద్దెనెక్కడం ఖాయం

- టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో గడిచిన 5 సంవత్సరాలలో కొనసాగిన జగన్ రాక్షసపాలనకు రాష్ట్ర ప్రజలు చరమ గీతం పాడారని కర్నూలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం వారిరువురు జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయిని, ఈ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనది మొదులుకొని ఓటింగ్ రోజు వరకు తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించి, ఎప్పటికప్పుడు వైసిపి ప్రభుత్వం చేసిన అప్రజాస్వామిక విధానాలను తెలుపుతూ, ప్రజలలో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను గురించి ప్రతిపక్ష పార్టీలకు, ప్రజలకు తెలియజెపుతూ, ప్రతిపక్ష పార్టీలను అప్రమత్తం చేసినందులకు, పత్రికా, మీడియా ప్రతినిధులందరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు జిల్లాలోని టిడిపి, బిజెపి, జనసేన నాయకులకు, టిడిపి వివిధ స్థాయిలలో ఉన్న పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, జిల్లా ప్రజానీకానికి, ఎన్నికలు ప్రశాంతంగా జరిపిన జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్‌కి, కర్నూలు పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు, జిల్లా పోలీస్ శాఖ ఎస్‌పి కి, పోలీస్ ఉన్నతాధికారుకలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.నాగేంద్రకుమార్, చంద్రశేఖర్, జె.తిరుపాల్ బాబు, సోమిశెట్టి నవీన్, పి.హనుమంతరావు చౌదరి, ముంతాజ్, సత్రం రామక్రిష్ణుడు, పి.రవికుమార్, రాజూయాదవ్, కుర్వ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి







సిబిఎస్ఇ ఫలితాల్లో రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాల్లో నగర సువర్లలోని లక్ష్మీపురం సమీపంలో ఉన్న రిడ్జ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు.111 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందులో 90 శాతం పైన 14 మంది, 80 శాతం పైగా49 మంది, 70శాతంకు పైగా 73 మంది విద్యార్థులు ఉత్తీర్ణత శాతం సాధించినట్లు పాఠశాల సిఇఒ గోపీనాథ్, ప్రిన్సిపల్ రాజేంద్రన్ వెల్లడించారు. ఈ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ ఘనపరిచిన వారిలో హరి మనోహర్ రెడ్డి, జోషితరెడ్డి, లిఖిత్, జయంత్ కుమార్ యాదవ్, శ్రీ ప్రణవి, యశస్విని ఉత్తమ మార్కులు సాధించారని వెల్లడించారు







16 నుండి బిఇడి,బిపిఇడి సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఆర్‌యు పరిధిలోని బిఇడి మూడవ సెమిస్టర్ , బిఇడి,బిపిఇడి మొదటి , నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్ , సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 16 నుండి ప్రారంభమవుతాయని వర్సిటీ వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని 15 పరీక్ష కేంద్రాల్లో 16 నుండి ప్రారంభమై 21 తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఎస్కే వర్సిటీ ఫెయిల్ అయిన విద్యార్థులకు పరీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో 1994-95 విద్యా సంవత్సరం నుండి 2014-15 విద్యా సంవత్సరం వరకు డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఎగ్జామినేషన్స్ విభాగం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం పరిధిలో సబ్జెక్టులు ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్ష రాసేందుకు దరఖాస్తుకు జూన్ 14 వరకు గడువుందని వెల్లడించారు. వివరాలకు వర్సిటీవెబ్సైట్లో చూడాలన్నారు.

కోడుమూరులో 79.14 ఓట్లు నమోదు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కోడుమూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ హోరాహోరీగా సాగింది.వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ నియోజకవర్గంలో దాదాపుగా 79.14 శాతం పోలింగ్ నమోదు కావడం పట్ల చర్చనీయాంశమైంది. కోడుమూరు నియోజకవర్గ పరిధిలో ప్రధానంగా కర్నూలు రూరల్. గూడూరు, సి బెళగల్, కోడుమూరు మండలాలతో పాటు గూడూరు అర్బన్ ప్రాంతం ఉన్నాయి. ఇక్కడ వైసిపి నుండి డాక్టర్ ఆదిమూలపు సతీష్, టిడిపి నుండి బొగ్గుల దస్తగిరి కాంగ్రెస్ నుంచి పరిగెల మురళీకృష్ణ పోటీ పడ్డారు.

బాబర్ లస్సీకి భలేగిరాకి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వేసవికాలం వచ్చిందంటే కర్నూలు నగరంలో ప్రధాన కూడళ్లలో లస్సీ బండ్లు వెలుస్తాయి. అయితే నగరంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన లస్సీలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే లభిస్తాయి. అందులో పేరు ప్రఖ్యాతులుగాంచిన ఈ లస్సీ బాబర్ లస్సి సెంటర్ గడియారం ఆస్పత్రి దగ్గరలో ఉంది. వారు నగర పరిసర ప్రాంతాలైన గ్రామాల నుండి గేదె పాలను లీటరుకు రూ. 75 చొప్పున సేకరించి తెచ్చి చిక్కని పాలను వేడి చేసి చల్లార్చి మట్టి పాత్రల్లో పెట్టి తోడేస్తారు. వాటిని ఉదయం 10 నుండి బాబర్ లస్సి కేంద్రంలో ఉంచి అమ్మడం మొదలు పెడతారు. సింగల్ రూ.30 ఫుల్ రూ.35 చొప్పున అమ్ముతుంటారు. లస్సీ చిక్కదనం చల్లదనంతో పాటు మీగడ కలిగి ఉండడం చేత లస్సినీ వేసవిలో తాగేందుకు ప్రజలు బారులు తీరుతారు. అక్కడ ముందుగా డబ్బులు కట్టి టోకెన్ తీసుకుంటే గాని లస్సీ ఇవ్వరు. నగరంలో బాబర్ లస్సీకి మంచి పేరు ఉండడంతో అటువైపుగా వెళ్లే ప్రతి ఒక్కరూ ఆ లస్సీ రుచి చూసి వెళుతుంటారు.

ప్రతిరోజు 400 నుండి 500 లీటర్ల పాలతో లస్సీ తయారి

బాబర్ లస్సి యజమాని మహమ్మద్‌అయూబ్

నగర పరిసర గ్రామాల నుండి పాలను లీటరు రూ.70 నుండి రూ. 75 చొప్పున కొని తెచ్చి వేడి చేసి మట్టి పాత్రల్లో ఉంచి చల్లారిత తరువాత పెరుగు తోడు వేస్తారు. వాటిని మరుసటి రోజు ఉదయం 10 గంటలనుండి లస్సీ చేయడం మొదలు పెడతాం. లస్సీలో ఎలాంటి కల్తీ లేకుండా చేయడం వల్ల జనం తండోపతండాలుగా వచ్చి తాగుతుంటారు. తాగిన వారు ఆ నోట ఈ నోట ఒకరికి ఒకరు చెప్పటం వల్ల మా లస్సీకి గిరాకీ పెరిగింది. లస్సీలో ఒకరోజు పల్చగా ఒక రోజు చిక్కగా అనేది లేకుండా ఒకే విధంగా చేసి అమ్ముతుంటాం. అందుచేత నగరంలో మా లస్సీకి మంచి పేరుంది. లస్సిని ఇక్కడ తాగడం కాకుండా ఇండ్లకు పార్సిల్ కూడా తీసుకొని వెళుతుంటారు.



బాబర్ లస్సిసెంటర్

బాబర్ లస్సీ భలేరుచి

ముదస్సిర్ ,పెద్ద మార్కెట్



గడియారం ఆస్పత్రి వద్ద తయారు చేసే బాబర్ లస్సీ ఆహా ఏమి రుచి అనేలా చల్లగా తీయగా ఉండడమే కాకుండా కడుపులో హాయిని కలిగిస్తుంది.అందుకే ప్రతిరోజు అక్కడికి వెళ్లి నేను లస్సిని తాగుతాను. పెరుగుతో చిలికిన లస్సీకి చక్కెర పాకం కూడా తోడు చేసి అందులో ఐస్ వేసి చేయడంతో చిక్కగా ఉంటుంది. ప్రతి గ్లాస్‌కు కొంత మీగడ కూడా వేయడం వల్ల లస్సీకి మీగడ తోడై రుచిని పెంచుతుంది.

గిరిజన సంఘాల అభ్యున్నతికి హ్యుందాయ్ సహకారం



హ్యుందాయ్ హెడ్ పునీత్ ఆనంద్‌తో నిర్వహకులు, గిరిజనులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

గిరిజన సంఘాల అభ్యున్నతికి హ్యుందాయ్ సహకరిస్తుందని హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ కార్పొరేట్ వ్యవహారాల ఎవిపి వర్టికల్ హెడ్ పునీత్ ఆనంద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ సామాజిక బాధ్యత, పురోగతి, నిబద్ధతలో స్థిరంగా ఉందన్నారు. చెంచు, ఇతర తెగల వారు అభ్యున్నతికి, ఆర్థికంగా, సామాజికంగా దోహద పడుతున్నామని తెలిపారు. అందులో భాగంగానే కర్నూలులో చెంచు తెగకు చెందిన 150 కుటుంబాలు నివసించే ఐదు గ్రామాలను హెచ్ఎం ఐఎఫ్ గుర్తించి వారికి వ్యవసాయ నైపుణ్యాలు అందించడం, 250 ఎకరాల భూమిలో విస్తరించి ఉన్న ప్రాంతంలో జీవనోపాధి కల్పన కార్యకలాపాల ద్వారా వారికి సాధికారత కల్పించ డానికి ప్రయత్నిస్తోందని పునీత్ ఆనంద్ స్పష్టం చేశారు. కర్నూలులో అంతరించిపోతున్న సాంస్కృతిక కళారూపాల పరిరక్షణకు కూడా తన ప్రయత్నాలను హెచ్ఎంఐఎఫ్ అంకితం చేసింద న్నారు. తమిళనాడులోని కట్టైక్కుట్టు సంగం థియేటర్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సోహ్రాయ్ వాల్‌ఆర్ట్, కేరళకు చెందిన గొట్టం వుల్లాల్ డాన్స్, కర్ణాటకకు చెందిన కవండి మేకింగ్ వంటి వాటి పరిరక్షణకు హెచ్ఎంఐఎఫ్ చేస్తున్న ప్రయత్నాలకు నిలువెత్తు నిదర్శనమని పునీత్ ఆనంద్ వివరించారు.



పనులను పరిశీలిస్తున్న ఎపిఇఆర్‌సి ఛైర్మన్

ఎపిఇఆర్‌సి బిల్డింగ్ పనులు పురోగతిని సమీక్షించిన ఛైర్మన్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ సివి నాగార్జున రెడ్డి, మెంబర్ టెక్నికల్ ఠాకూర్ రామ్ సింగ్, మంగళవారం కర్నూలు ఎపి కార్బైడ్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఎపిఇఆర్‌సి బిల్డింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు సూపరెన్‌టెన్‌డెంట్ ఇంజనీర్ ఎం. ఉమాపతి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ పి.ఓబులేష్ , సూపరిన్‌టెన్‌డెంట్ సివిల్ భాస్కర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలరావు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రమేష్ (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

స్కూటర్లు ఢీకొని ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం పెండేక్ ఆర్‌ఎస్ రాంపల్లి క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంపల్లి గ్రామానికి చెందిన బోయ రమేష్ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన బోయ నాగరాజుకు తలకు బలమైన గాయాల కావడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తుగ్గలి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన బోయ రమేష్ పెండేకల్లు ఆర్‌ఎస్ నుండి తమ గ్రామమైన రాంపల్లికి స్కూటర్ పై వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బోయ నాగరాజు స్కూటర్ మీద వస్తుండగా క్రాస్ వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజుకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తము కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు.



తాగునీటి కోసం కష్టాలు పడుతున్న ప్రజలు

గుడికంబాళిలో తాగునీటి కష్టాలు..!

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నది ఒడ్డున ఉన్న గుడికంబాళి గ్రామంలో తాగునీరు అందక ప్రజలు కష్టాలు పడుతున్నారు. ఈ గ్రామంలో జలజీవన్ పథకం పనులు ముందుకు సాగకపోవడంతో నీటి సమస్య జటిలమైంది. ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు తాగునీరు అందకపోవడంతో ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. జల జీవన్ పనుల కోసం పాత పైపు లైన్లు తొలగించడంతో నీటి ఇబ్బంది ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. జల జీవన్ పనులు పూర్తయ్యేంత వరకు ప్రత్యామ్నాయంగా తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. జలజీవన్ పనులు వెంటనే పూర్తిచేసి తాగునీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఓటు వేసేందుకు వస్తూ... మృత్యు ఒడిలోకి

- గుండెపోటుతో యువకుడు మృతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

ఓటు వేసేందుకు హైదరాబాదు నుంచి సొంత గ్రామానికి వస్తూ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎం.కొట్టాల గ్రామానికి చెందిన దుగ్గనూరు చిట్టి బాబు (32) సోమవారం బస్సులో వస్తుండగా కర్నూలు దాటిన తర్వాత గుండెపోటుతో మృతి చెందారు. చిట్టిబాబు భార్య ప్రభావతి గత ఎనిమిది నెలల క్రితం మృతి చెందారు. వీరికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఉపాధి కోసం హైదరాబాదులో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిట్టిబాబు ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు స్వంత గ్రామానికి వస్తుండగా బస్సులో గుండెపోటుతో మరణించినట్లు బంధువులు తెలిపారు. తల్లిదండ్రులను పోగొట్టుకుని అనాథలైన చిన్నారులను చూసి గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. చిట్టిబాబు మృతదేహాన్ని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరుపాక్షి తనయుడు చంద్రశేఖర్, సర్పంచి రాజశేఖర్‌లు సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నారులకు ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకునేటట్లు చూస్తామని తెలిపారు.

ఈరన్న స్వామిని దర్శించుకున్న భరత్

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామిని టిడిపి కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి టిజి.భరత్ దర్శించుకున్నారు. మంగళవారం ఉరుకుంద క్షేత్రానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. దేవాలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈయన వెంట ఉరుకుంద టిడిపి నాయకులు కొట్రెష్ గౌడ్ ఉన్నారు.

ఉరుకుందలో ఉన్న టిజి.భరత్



ఇలా ఉంటే నడిచేదెలా..?

- బురదమయంగా రైల్వే ట్రాక్ రోడ్డు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని నిర్మల్ టాకీస్ మీదుగా రైల్వే ట్రాక్‌కు వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారింది. ఆ రోడ్డు గుండా వాహనాలు వెళ్లాలంటే 'వామ్మో' అనాల్సిన పరిస్థితి ఉంది. మున్సిపల్ రోడ్డు ఎప్పుడూ వాహనాలతో రద్దీగా ఉంటుంది. శంకర్ నగర్, కల్లుబావి, లేబర్ కాలనీ, క్రాంతి నగర్, ఢణాపురం, నారాయణపురం, చాగి, జగనన్న కాలనీ, ఆలూరు వెళ్లేవారు రైల్వే ట్రాక్ రోడ్డు మీదుగా ప్రయాణం సాగిస్తున్నారు. ఆ రోడ్డు కూడా గుంతలమయం కావడంతో ప్రత్యామ్నాయం రోడ్డు లేక ఇబ్బందులు తప్పవా అంటూ నిలదీస్తున్నారు.

చిన్న పాటి వర్షానికి నిలిచిన నీరు

రోడ్డు గుంతలమయం కావడంతో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు అదుపు తప్పి కింద పడిన సందర్భాలు ఉన్నాయి. ఆ రోడ్డు గుండా జగనన్న కాలనీ నిర్మాణం కోసం మెటీరియల్ తరలించే టిప్పర్ల రద్దీ కూడా రోజురోజుకు పెరుగుతూనే ఉంది. దీంతోనే రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని వాహనదారులు పేర్కొంటున్నారు. కనీసం ఆ రోడ్డులో గ్రావెల్‌తోనైనా గుంతలు పూడ్చి మురుగు నిలవకుండా చూడాలని కోరుతున్నారు.

నిలిచిన పనులు

పట్టణంలోని నిర్మల్ థియేటర్ నుంచి రైల్వే ట్రాక్ వరకు రోడ్డు నిర్మాణం చేయిస్తామని అధికారులు అప్పట్లో తెలిపారు.



బురదమయంగా ఉన్న రైల్వే ట్రాక్ రోడ్డు

నిర్మల్ థియేటర్ నుంచి తుంగభద్ర దిగువ కాలువ డిఇ కార్యాలయం మీదుగా ప్రభుత్వ గర్ల్స్ హై స్కూల్ వరకు మాత్రమే బిటి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం సుమారు రూ.కోటి మంజూరయినట్లు పనులు జరుగుతున్న సమయంలో అధికారులు తెలిపారు. బిల్లులు కాక, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. డీఎస్పీ బంగ్లా వద్ద గుంతలు పడ్డాయి. రాత్రి వేళలో ఆ రోడ్డులో వీధి లైట్లు కూడా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు కింద పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. రైల్వే ట్రాక్ వద్ద వ్యర్థాలు పడేయడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉంటుంది. అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని పలువురు వాపోతున్నారు. వాహనదారుల ఇబ్బందులను గమనించి ఆ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

పండ్ల తోటల పెంపకానికి ఉచితంగా మొక్కలు

ప్రజాశక్తి- దేవనకొండ

2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి చట్టం కింద చిన్నకారు రైతులకు పండ్ల మొక్కలను ఇస్తున్నట్లు ఎపిఒ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. వంద శాతం రాయితీతో సపోటా, మామిడి, సీతాఫలం, యాపిల్, రేగి పండు తదితర పండ్ల మొక్కలను రైతులకు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గాజులదిన్నె ప్రాజెక్టులోకి నీటి చేరిక

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని గాజులదిన్నె ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి నీరు వచ్చి చేరినట్లు ప్రాజెక్టు డ్యాం ఎఇ చిన్న అలీ మంగళవారం తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు హంద్రీనది పరివాహక ప్రాంతాల నుంచి స్వల్పంగా వరదనీరు వచ్చి డ్యామ్‌లోకి చేరుతున్నట్లు తెలిపారు. డ్యామ్‌లోకి వచ్చి చేరిన వరద నీటితో రెండు సెంటిమీటర్ల మేర నీటిమట్టం పెరిగినట్లు ఆయన వివరించారు.



గాజులదిన్నె ప్రాజెక్టు (ఫైల్)

ఆకట్టుకున్న ఆదర్శ పోలింగ్ కేంద్రం

- 84 శాతం పోలింగ్ నమోదు

ప్రజాశక్తి - గోనెగండ్ల

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో మూడు ఆదర్శ పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా గోనెగండ్ల బస్టాండ్ ప్రాథమిక పాఠశాలలో 236వ పోలింగ్ కేంద్రాన్ని ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రం ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంది. ఈ పోలింగ్ కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా రూపుదిద్దడంతో పాటు పోలింగ్ సిబ్బంది బస చేయడానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించారు. పోలింగ్ కేంద్రం ముందు చలువ పందిళ్లను ఏర్పాటు చేయడంతో పాటు రంగురంగుల బెలూన్లను అలంకరించి ముఖ ద్వారం వద్ద కొబ్బరి మట్టలు, మామిడి ఆకులతో తోరణాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో మొత్తం 1,250 మంది ఓటర్లు ఉన్నారు. 520 మంది స్త్రీలు, 538 మంది పురుషులు కలిపి మొత్తం 1,058 మంది సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకోగా 84.64 శాతం పోలింగ్ నమోదయింది. భవిష్యత్తులో అన్ని పోలింగ్ కేంద్రాలను ఇలాగే రూపుదిద్దితే పోలింగ్ వంద శాతానికి పెరిగే అవకాశాలు ఉంటాయని సీనియర్ ఓటర్లు అభిప్రాయపడుతున్నారు.



ఆదర్శ పోలింగ్ కేంద్రం



టిడిపి అభ్యర్థిపై హత్యాయత్నం సిగ్గుచేటు

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం చేయడం సిగ్గుచేటని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. మంగళవారం ఆదోనిలోని స్వగృహంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పోలింగ్ జరిగాక కూడా వైసిపి దాడులకు అంతులేకుండా పోతోందన్నారు. ఎన్నికల కమిషన్ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వైసిపి నేతల్లో మాత్రం మార్పు రావడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పోలింగ్‌లో వైసిపి పలు కుట్రలు పన్నిందని విమర్శించారు. మంగళవారం ఈవిఎం స్ట్రాంగ్ రూముల వద్ద పలు అవకతవకలకు ప్రణాళిక రచించినట్లు సమాచారమన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతగా ఉన్న టిడిపి నాయకులపై వైసిపి నాయకులు దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. పులివర్తి నానిపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ప్రజాశక్తి - హొళగుంద

వైసిపి, టిడిపిలు 'మేం గెలుస్తామ'ంటే, 'మేము గెలుస్తామ'ంటూ గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. ఈసారి మహిళల ఓట్ల అత్యధికంగా నమోదు కావడంతో మహిళా ఓటర్లు ఎటు వెళ్లారో, ఎవరికి ఓటు వేశారో ఎవరికీ అర్థం కావడం లేదు. ఇరు పార్టీల ముఖ్య నేతలు కార్యకర్తలు, నాయకులు ఆయా గ్రామాల్లో జరిగిన ఓటింగ్ శాతాన్ని బట్టి ఎవరికి ఎంత పడి ఉండవచ్చని వ్యత్యాసాలను చూసుకుంటున్నారు. జూన్ 4 వరకు వేచి చూడాల్సిన అవసరం ఉంది. సోమవారం జరిగిన పోలింగ్‌లో గత 2019 ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి ఓటింగ్ శాతం పెరిగినట్లు గత రికార్డుల తెలుస్తోంది. సోమవారం జరిగిన పోలింగ్‌లో 17,290 మంది పురుషులు ఓటు హక్కును వినియోగించుకోగా 16,712 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతరులు ఆరుగురు ఓటు హక్కును వినియోగించుకోగా మొత్తం ఓట్లు 34,008 పోలయ్యాయి. మండలం మొత్తం మీద 79.11 ఓటింగ్ శాతం నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకి పునాది ఆదర్శ పాఠశాల

- 22 వరకు పాఠశాల, కళాశాల ప్రవేశాలకు దరఖాస్తు గడువు

- ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వర రావు

ప్రజాశక్తి - రుద్రవరం

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకి పునాది ఆదర్శ పాఠశాల అని, ఈ నెల 22 వరకు ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వర రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత నెల నుంచి అప్లికేషన్ల ప్రక్రియ ప్రారంభమయిందని, ఈ నెల 22వ తేదీ తుది గడువన్నారు. 10 తరగతి అర్హత పొందిన విద్యార్థులందరూ తప్పకుండా రుద్రవరం ఆదర్శ పాఠశాలలో లేదా మీ సేవ ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం పరీక్ష రాసే వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చన్నారు. 10వ తరగతిలో సాధించిన మార్కుల మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో మాత్రమే బోధన ఉంటుందని స్పష్టం చేశారు. వీటిలో విద్యనభ్యసించేందుకు ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేదన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చొప్పున దరఖాస్తు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9849215838కి కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు.



రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రాబోతుంది : కోట్ల

ప్రజాశక్తి - ప్యాపిలి

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని, చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి అవుతారని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. తొందరలో బుగ్గనను ఇంటికి సాగనంపుతున్నామన్నారు. ఎన్నికలలో భాగంగా ఓ మాజీ ఐపీఎస్ అధికారి పిఎన్ బాబు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి బేతంచర్లలో వెళ్తుండగా మంత్రి అనుచరులు దాడి చేయడం వైసీపీ దౌర్జన్యాలకు పరాకాష్ట అన్నారు. ప్రభుత్వం రాగానే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. అధికారంలోకి రాగానే గ్రామాలను అభివృద్ధి చేసి, ప్రజలకు తాగునీరు సాగునీరు అందిస్తామని తెలిపారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, లక్క సాగరం లక్ష్మిరెడ్డి, డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణమూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, అంకిరెడ్డి, బత్తుల రమేష్ రెడ్డి, రాంమోహన్, రామసుబ్బయ్య, కొంగనపల్లె మధు, చల్లా వీరా, ఖాజా పీర్, వెంకట రమణచారి, సత్యం, రాజశేఖర్, పుల్లారెడ్డి, కాంతారావు, శివ, దీపు, వెంకటేష్, రమేష్, డిష్ శీను, మల్లికార్జున, స్వామి, జయరాముడు, ఆదిరెడ్డి, పెద్ద రామాంజి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోనే గెలిపిస్తుంది : కోట్ల

బేతంచర్ల : తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ మ్యానిఫెస్టో పథకాలే తనను గెలిపిస్తుందని డోన్ ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. బేతంచర్ల పట్టణం నంద్యాల రోడ్డులోని అన్నపూర్ణ అనాధాశ్రమం సమీపంలో గల టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య , పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాత్రి తొమ్మిది గంటలైనా ఓటు వినియోగించుకోవడం, 82 శాతం కంటే పైగా పోలింగ్ జరగడం టిడిపికే మెజార్టీ వస్తుందని, కుట్ర కుతంత్రాల మంత్రి బుగ్గనకు, నిరంకుశ వైసిపికి చరమగీతం పలికి ప్రజలు టిడిపిని ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోట్లా తనయురాలు కోట్ల చిత్ర, మాజీ జెడ్పిటిసి బుగ్గన ప్రసన్న లక్ష్మి, సోమశేఖర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి షేక్షావల్లి చౌదరి, టిడిపి సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, దస్తగిరి రెడ్డి, తిరుమలేష్ చౌదరి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, సీతారాంపురం వెంకటేశ్వర్లు, బలపాలపల్లి నాయకులు రాచపోగుల ఈశ్వరయ్య, అంజాద్ భాష, సుధాకర్ చౌదరి, బుగ్గన మాధవి రెడ్డి, రవీంద్ర నాయక్, నాగరాజు, రూబెన్, రామ్మూర్తి, ఉప్పరి పక్క బాలుడు, రామకృష్ణ, శివ, కోట్ల మధు కుమార్ పాల్గొన్నారు.



ప్యాపిలిలో మాట్లాడుతున్న కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి



బేతంచెర్లలో మాట్లాడుతున్న కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి

నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు

- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి



పోలింగ్‌లో పాల్గొని ఓటు వేసిన నియోజకవర్గ ప్రజలకు వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరుపాక్షి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం చిప్పగిరిలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గ ప్రజలు, మహిళలు, వైసిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించారని తెలిపారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్ రెడ్డిని గెలిపిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వైసిపి నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు, అధికారులకు, శ్రేయోభిలాషులకు, మీడియా మిత్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి చేసిన పోలీసు అధికారులకు, పోలింగ్ అధికారులకు, ఓటు వేసి సహకరించిన ప్రతి ఒక్క ఓటరుకూ అభినందనలు తెలియజేశారు. జూన్ 4న వైసిపి ప్రభంజనంతో ప్రజలు ఆనందోత్సవాల్లో మునుగుతారని చెప్పారు. వైసిపి ప్రభంజనం రాష్ట్రమంతా వ్యాపిస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తిరిగి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటింటికీ అందజేసి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తోడ్పాటునందిస్తారని తెలిపారు. అందరి సహకారంతో ఆలూరు నియోజకవర్గం సేవకుడిగా ప్రజల కోసం పని చేస్తానని చెప్పారు.

వైసిపిదే విజయం

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల



మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ పాపిరెడ్డి

రాష్ట్రంలో వైసిపిదే విజయమని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కొలిమిగుండ్లలోని ఆయన తన కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు వారి బ్యాంకు అకౌంట్లోనే పడ్డాయని,జగన్ మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఆయనను గెలిపిస్తాయన్నారు. కొలిమిగుండ్ల మండలంలో నిన్న జరిగిన ఎన్నికల్లో ఎన్నికల్లో మహిళలే అత్యధిక శాతం ఓటింగ్‌లో పాల్గొనడం వైసిపి ప్రభుత్వానికి పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. జూన్ 4న బనగానపల్లె ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డి, మళ్ళీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తారన్నారు. వైసిపి కార్యకర్తలు చేసిన కృషికి గుర్తింపు వైసీపీ ప్రభుత్వంలోనే లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, సత్తి గారి రామిరెడ్డి, పేరం బైపిరెడ్డి, మలక రాజారెడ్డి, నందిపాడు సర్పంచ్ గురివిరెడ్డి కృష్ణారెడ్డి, ఎస్.వెంకటేశ్వర రెడ్డి, దస్తగిరి, యాపర్ల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు : మాజీ ఎమ్మెల్యే బీసీ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

టిడిపి కార్యకర్తలందరికీ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం కొలిమిగుండ్లలోని టిడిపి కార్యాలయంలో ఎన్నికల సరళిపై బీసీ జనార్దన్ రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండలంలో చంద్రబాబుతోనే అభివద్ధి సాధ్యమని అధిక సంఖ్యలో తరలివచ్చి ఓట్లు వేశారని తెలిపారు. జూన్ 4 తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చి ఓట్లు వేసిన మండలంలోని ఓటర్లు అందరికీ, తన గెలుపు కోసం కృషి చేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి, ఓబాల్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు గొంగటి హుసేన్ రెడ్డి, సత్య రెడ్డి, కోటపాడు శివరాంరెడ్డి, నంద్యాల నారాయణరెడ్డి, కోటపాడు వెంకటేశ్వర్లు, సూరి శివారెడ్డితోపాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



టిడిపి నాయకులు, కార్యకర్తలతో బీసీ.జనార్దన్ రెడ్డి